# అనర్హతకు ఇవీ గీటురాళ్లు

జయప్రకాష్ నారాయణ్
(రచయిత లోక్‌సత్తా, 'ఓట్ ఇండియా'ల సమన్వయకర్త)

**BB-20-Mar-2006**

లాభదాయక పదవిలో కొనసాగుతున్నందుకు రాజ్యసభ సభ్యత్వానికి జయా బచ్చన్ అనర్హురాలని రాష్ట్రపతి ప్రకటించడంతో- అసలు అనర్హత ఎవరెవరికి, ఏ పరిస్థితుల్లో వర్తిస్తుందన్నది చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంలో రాజ్యాంగ నిబంధనలు ఏమంటున్నాయనేది కీలకం. పార్లమెంటు సభ్యులను అనర్హత నుంచి మినహాయించే అధికారం పార్లమెంటుకే తప్ప రాష్ట్ర శాసనసభకు లేదు. ఉత్తరప్రదేశ్ శాసనసభ అమోదించిన బిల్లుపై ఆ రాష్ట్ర గవర్నర్ ఆమోదముద్ర వేసి ఉంటే జయా బచ్చన్‌పై అనర్హత వేటు పడేది కాదన్న వాదనలో వాస్తవం లేదంటున్న వ్యాసమిది.

జయా బచ్చన్ రాజ్యసభ సభ్యత్వాన్ని రాష్ట్రపతి రద్దు చేశారు. ఉత్తరప్రదేశ్ చలనచిత్ర అభివృద్ధి మండలి అధ్యక్షురాలిగా 2004 జులై 14 నుంచి లాభదాయక పదవిలో కొనసాగుతున్నందున ఆమె రాజ్యసభ సభ్యత్వానికి అనర్హురాలని రాష్ట్రపతి ప్రకటించారు. పార్లమెంటు సభ్యులొకర్ని ఈ విధంగా అనర్హతకు గురిచేయటం ఇదే మొదటిసారి. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ అమర్‌సింగ్‌పై కూడా ఇదే విధమైన చర్య తీసుకోబోతున్నారనే వార్తలు వస్తున్నాయి. రాష్ట్రంలో కొన్ని పదవుల్లో ఉన్న పార్లమెంటు సభ్యులను అనర్హత ప్రమాదం నుంచి తప్పిస్తూ ఉత్తరప్రదేశ్ శాసనసభ ఒక బిల్లును ఆమోదించింది. కానీ దానికి గవర్నర్ సమ్మతి లభించలేదు. అనర్హత అంశం రానున్న కాలంలో పెనురాజకీయ వివాదంగా మారేది ఖాయం. ఈ నేపథ్యంలో- చట్టసభల సభ్యత్వం విషయంలో రాజ్యాంగం, చట్టం ఏం చెబుతున్నాయో ప్రజలు అవగాహన చేసుకోవడం ముఖ్యం.

## నిబంధనల్లో ఏముంది?

రాజ్యాంగంలోని 102వ అధికరణ కింద జయా బచ్చన్‌ను అనర్హురాలిగా ప్రకటించారు. అనర్హత పరిధిలోకి రావని పార్లమెంటు ప్రకటించిన పదవులను మినహాయించి- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఇతర లాభదాయక పదవికి ఎంపికైన, నిర్వహిస్తున్న పార్లమెంటు ఉభయ సభల సభ్యుల్లో ఎవరినైనా అనర్హుడిగా ప్రకటించవచ్చునని 102(1)(ఎ) అధికరణ స్పష్టం చేస్తోంది. ఒక వ్యక్తి కేంద్రంలోనో, రాష్ట్రంలోనో మంత్రిగా ఉన్నంత మాత్రాన లాభదాయక పదవిని ఆశించరాదని రాజ్యాంగం కూడా స్పష్టం చేసింది. అనర్హతకు సంబంధించిన సమస్య తలెత్తినప్పుడు, ఆ అంశాన్ని రాష్ట్రపతికి నివేదించాలని, ఆయనదే తుది నిర్ణయమని 103వ అధికరణ పేర్కొంటోంది. రాష్ట్రపతి నిర్ణయం తీసుకొనే ముందు ఎన్నికల కమిషన్ అభిప్రాయాన్ని తెలుసుకోవలసి ఉంటుంది. దాన్ని అనుసరించి చర్య తీసుకోవలసి ఉంటుంది. ఎన్నికల కమిషన్ అభిప్రాయానికి అనుగుణంగా రాష్ట్రపతి నడచుకోక తప్పని పరిస్థితిని రాజ్యాంగ నిబంధనలు కల్పిస్తున్నాయి. ఈ విషయంలో రాష్ట్రపతి తన విచక్షణాధికారాన్ని ఉపయోగించే అవకాశమే లేదు. ఒక విధంగా ఎన్నికల కమిషన్‌దే తుది నిర్ణయమన్న మాట. ఒక సభ్యుడి అనర్హతపై నిర్ణయం తీసుకోవడం వంటి కీలకాంశంలో పక్షపాతానికి తావులేకుండా చూసే ఉద్దేశంతో ఈ నిబంధనను రాజ్యాంగంలో పొందుపరిచారు.

రాష్ట్ర శాసనసభ, శాసన మండలి సభ్యత్వం విషయానికి వస్తే- 191, 192 అధికరణల్లో ఇలాంటి నిబంధనలే ఉన్నాయి. అనర్హత పరిధిలోకి రాదంటూ రాష్ట్ర శాసనసభ ప్రకటించిన పదవిలో ఉన్న శాసనసభ్యుణ్ని అనర్హత నుంచి మినహాయిస్తారు. ఎన్నికల కమిషన్ అభిప్రాయం ప్రాతిపదికగా అనర్హతపై గవర్నర్ నిర్ణయం తీసుకొంటారు.

ఈ నిబంధనలనుబట్టి ఒక విషయం స్పష్టమవుతోంది. ఫలానా పదవుల్లో ఉంటే పార్లమెంటు సభ్యత్వానికి అనర్హులు కారు అంటూ 102వ అధికరణ ప్రకారం ఒక్క పార్లమెంటు మాత్రమే ప్రకటన చేయగలుగుతుంది. పార్లమెంటు సభ్యులు అనర్హతకు గురికాకుండా ఆయా పదవులకు మినహాయింపు ఇచ్చే అధికారం రాష్ట్ర శాసనసభకు లేదు. అందువల్ల, పార్లమెంటు సభ్యుల అనర్హతపై నిర్ణయానికి సంబంధించి ఉత్తరప్రదేశ్ శాసనసభ చేసిన శాసనానికి ఎలాంటి విలువ లేదు. ఉత్తరప్రదేశ్ శాసనసభ ఆమోదించిన బిల్లుపై ఆ రాష్ట్ర గవర్నర్ టి.వి.రాజేశ్వర్ రాజముద్ర వేసి ఉంటే జయా బచ్చన్‌పై అనర్హత వేటు పడేది కాదంటూ ప్రసార సాధనాల్లో పుంఖానుపుంఖాలుగా కథనాలు వెలువడుతున్న నేపథ్యంలో ఈ అంశానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. ఉత్తరప్రదేశ్ శాసనసభ చేసే అలాంటి చట్టమేదీ 102వ అధికరణకింద చెల్లుబాటు కాదు. గవర్నర్ ఆ బిల్లు కు ఆమోదముద్ర వేయకపోవటం సరైనదే. ఒక పార్లమెంటు సభ్యుణ్ని అనర్హత వేటు నుంచి కాపాడేది పార్లమెంటే.

పార్లమెంటు సభ్యులను అనర్హత నుంచి మినహాయిస్తున్న తీరు అనేక సందేహాలకు తావిస్తోంది. కొన్ని లాభదాయక పదవులను చేపట్టే పార్లమెంటు సభ్యులను అనర్హత నుంచి మినహాయిస్తూ పార్లమెంటు 1959లో ఒక చట్టం చేసింది. (1959 నాటి పదో చట్టం). ఎప్పటికప్పుడు లాభదాయక పదవులను మినహాయిస్తూ ఆ చట్టానికి సవరణలు చేశారు. ఉదాహరణకు- పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, పార్లమెంటులోని గుర్తింపు పొందిన పార్టీల లేదా వర్గాల నాయకులు, విప్‌లతోపాటు మైనారిటీల కమిషన్; ఎస్.సి, ఎస్.సి. కమిషన్; మహిళా కమిషన్ అధ్యక్షులను కూడా అనర్హత నుంచి మినహాయించారు. అంటే పార్లమెంటు సభ్యులు ఈ పదవుల్లో కొనసాగినా- వారి సభ్యత్వానికి ఎలాంటి ఢోకా ఉండదన్నమాట.

లాభదాయక పదవుల్లో ఉంటూ, అనర్హతకు గురి అయ్యే అవకాశం ఉన్న పార్లమెంటు సభ్యుల సంఖ్య 44 వరకు ఉందని వార్తలు తెలుపుతున్నాయి. ఏ పరిస్థితుల్లో అనర్హత వర్తించదో 1959 నాటి చట్టం 3వ సెక్షన్‌లోని (హెచ్) (ఐ) ఉపసెక్షన్లు స్పష్టం చేస్తున్నాయి. సెక్షన్ 3 (హెచ్) ప్రకారం- ప్రజా ప్రాధాన్యం కలిగిన ఏదైనా అంశంపై ప్రభుత్వానికి లేదా ఏదైనా సంస్థకు సలహా ఇవ్వడానికి లేదా దర్యాప్తు చేయడానికి తాత్కాలికంగా ఏర్పాటైన కమిటీకి అధ్యక్షుడిగానో, సభ్యుడిగానో ఉంటూ- గౌరవభృతి తప్ప ఎలాంటి పారితోషికం పొందని పార్లమెంటు సభ్యుణ్ని అనర్హత నుంచి మినహాయించారు. గౌరవ భృతి అంటే దినభత్యం. (ఎంపీ దినభత్యాన్ని అది మించరాదు). దారి ఖర్చులు, ఇంటి అద్దె, ప్రయాణాలకు ఖర్చుల రూపేణా భృతి చెల్లించాలి. చట్టబద్ధమైన లేదా చట్టబద్ధంకాని సంస్థ అధ్యక్షుడిగానో, డైరెక్టర్‌గానో, సభ్యుడిగానో ఉంటూ, గౌరవ భృతి మినహా ఎలాంటి ఇతర పారితోషికం పొందని వారిని కూడా అనర్హత ప్రమాదం నుంచి సెక్షన్ 3(ఐ) మినహాయించింది. పారితోషికం పొందే పదవిలో ఉంటే, అందుకు చట్టపరమైన మినహాయింపు లేకపోతే, ఆ సభ్యుడు సభ్యత్వానికి అనర్హుడు అవుతాడని చట్టం స్పష్టం చేస్తోంది. లంబర్దార్, పటేల్, దేశ్‌ముఖ్, కరణాల వంటి రెవెన్యూ అధికారులు పోలీసు (పోలీసు పటేల్) విధులు నిర్వహించకుండా ఉంటే- వారినీ అనర్హత నుంచి మినహాయించాలని సెక్షన్ 3(ఐ) పేర్కొంది.

ప్రభుత్వ రంగంలోని అనేక సంస్థలను అనర్హత నుంచి పార్లమెంటు మినహాయించింది. అంటే- ఆ సంస్థల్లో వివిధ హోదాల్లో ఉండే పార్లమెంటు సభ్యులపై అనర్హత వేటు పడదన్నమాట. ఆంధ్రప్రదేశ్‌లో మూడు సంస్థలు మినహాయింపు పొందాయి. అవి: వ్యవసాయ అభివృద్ధి నిధి సంఘం; సహకార వ్యవసాయ, మార్కెటింగ్ అభివృద్ధి నిధి సంఘం; పశుగణ కొనుగోళ్ల కమిటీ.

దీన్నిబట్టి, పార్లమెంటు సభ్యుల అనర్హతకు సంబంధించి ఎలాంటి నియమ నిబంధనలు వర్తిస్తున్నట్లు? మొదటిది- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోకి వచ్చే పదవుల విషయంలోనే అనర్హత వర్తిస్తుంది. వివిధ సొసైటీలు; సహకార సంఘాలు, ట్రస్టుల వంటి ప్రైవేటు సంస్థలు; వాణిజ్య సంస్థల్లో పదవులు కలిగి ఉండేవారికి అనర్హత వర్తించదు.

రెండోది- పార్లమెంటు సభ్యులకు అనర్హత నుంచి మినహాయింపులు ఇవ్వాల్సింది పార్లమెంటే కానీ, రాష్ట్ర శాసనసభ కాదు. రాష్ట్ర శాసనసభ, శాసన సభ్యులను మాత్రమే అనర్హత నుంచి మినహాయించగలుగుతుంది.

మూడోది- ఫలానా పదవికి మినహాయింపు ఇవ్వాలని చట్టం నిర్దిష్టంగా పేర్కొనకపోతే- తాత్కాలిక కమిటీ లేదా ఇతర సంస్థకు సేవలు అందజేస్తూ గౌరవ భృతి కాకుండా ఇతరత్రా పారితోషికం పొందే వ్యక్తికి సాధారణంగా అనర్హత నిబంధనను వర్తింపజేస్తుంటారు. ఆ వ్యక్తి పారితోషికం పొందకపోయినప్పటికీ, అది పారితోషికం పొందగలిగిన పదవి అయితే చాలు- అనర్హత వేటు వేస్తారు.

## బ్రిటిష్ విధానం మార్గదర్శకం

చట్టసభ సభ్యుడిని అనర్హతకు గురిచేయడమన్నది రాజకీయంగా ఎంతో ప్రభావం చూపుతుంది. వివిధ రాజకీయ పార్టీల ముఖ్య నాయకుల విషయంలో ఇది తీవ్ర పర్యవసానాలకు దారి తీస్తుంది. అందువల్ల అనర్హత విషయంలో ఎంతో జాగ్రత్తతో, ఆచి తూచి వ్యవహరించాలి. సభ్యులు ఏదైనా పదవిని స్వీకరించడానికి ముందే అనర్హత నియమాల గురించి అధికారికంగా తెలియజేస్తే ఉపయోగకరంగా ఉంటుంది. అమాయకంగా, తెలిసీ తెలియక నిర్ణయాలు తీసుకొనే సభ్యులపై అనర్హత వేటు వేసే బాధ తప్పుతుంది. ఇలాంటి విషయాల్లో సభ్యులకు సలహాలు ఇవ్వడానికి బ్రిటిష్ పార్లమెంటులో ఎథిక్స్ కమిషనర్ ఉంటారు. భారతీయ చట్టసభలూ అలాంటి పద్ధతిని అనుసరించాల్సిన తరుణమిదే.